సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


సందీప్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత సందీప్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ గురి కావడంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం సందీప్‌ను పరామర్శించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేద, మధ్య తరగతి ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సర్వ రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

మల్కాజిగిరి: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయాలని, వీధి కుక్కలను నియంత్రించాలని, మ్యాన్‌హోల్స్ పైన మూతలు ఏర్పాటు చేయాలని, బస్తీ దవాఖానాలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని డీసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని డీసీ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐలన్న, కృష్ణమూర్తి, పిట్టల శ్రీనివాస్, రమేష్‌గౌడ్, ఉడుత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రిటైర్‌మెంట్ ఉండదు


విజయకుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ఉపాధ్యాయులకు రిటైర్‌మెంట్ ఉండదని వారు జీవిత కాలం సమాజహితం కోసం పాటుపడుతూనే ఉంటారని ప్రముఖ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. జడ్పీహెచ్‌ఎస్ చర్లపల్లిలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవి విరమణ పొందిన వనం విజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ అభినందన సభ శుక్రవారం చర్లపల్లి సిరి గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుద్దాల మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాబుద్ధులు నేర్పి వారు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించే గొప్ప వృత్తి ఉపాధ్యాయవృత్తిగా పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌కాలనీలో రూ.42 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కాలనీ వాసుల సూచనల మేరకు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, కాలనీవాసులు మల్కాయ్య, వెంకట్‌రెడ్డి, రాజు, వీఎస్‌ఎన్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, పీఆర్,ప్రవీణ్,మల్లేష్,, రఘు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల మౌన దీక్షను విజయవంతం చేయాలి

అల్వాల్: పెన్షనర్ల సమస్యల సాధనకు ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మౌనదీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అన్నారు. శుక్రవారం అల్వాల్ వాసవీ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీహాల్ వద్ద మౌనదీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్‌ఎస్ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. మౌనదీక్షకు పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు శివశరణప్ప, పెద్ది రమేష్, సభ్యులు శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, దుర్గయ్య, సురేష్, పెద్దన్న, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లి దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

హబ్సిగూడ: ప్రసుత్త పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగష్టు 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టబోయే వంగపల్లి దీక్ష పోస్టర్‌ను శుక్రవారం హబ్సిగూడలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, యువసేన రాష్ట్ర అధ్యక్షులు రమేష్, కోర్ కమిటి సభ్యులు గణేష్, శ్రీనివాస్, యాకన్న, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మీ,లక్ష్మీ, కొల్లూరి వెంకటేష్, మధు,సంజీవ, అంజి, శాంతి కుమార్, రాజేష్ కన్నా తది తరులు పాల్గొన్నారు.

రమణీయం గంగా భవాని కల్యాణం

రామంతాపూర్: చిన్న చెరువు ప్రాంగణంలోని శ్రీ గంగా లక్ష్మీ భవాని అమ్మవారి ద్వాదశ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజైన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, ఆలయ చైర్మన్ పూస సత్తయ్య, గంగపుత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీటి మల్లయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కాపర్తి మోహన్ కృష్ణ, వెంపటి శ్రీనివాస్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అమ్మవార్ల వేషధారణ

రామంతాపూర్ : గణేష్‌నగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులు పోతరాజులు, అమ్మవార్ల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వైభవి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగ రోజున అమ్మవార్లను ఆరాధిస్తే అన్ని శుభాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు పండుగలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





బోనాల జాతరకు

సర్వం సిద్ధం

- మల్కాజిగిరిలో చారిత్రక ఆలయాలు
- వేడుకలకు ఆలయాల ముస్తాబు
- ప్రత్యేక ఆకర్షణగా ఫలహారం బండి ఊరేగింపు
- '28 ,29 తేదీల్లో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర

బాగు కోరే బందరు పోచమ్మ

భక్తుల బాగుకోరే అమ్మవారిగా బందరు పోచమ్మ అమ్మవారు పూజలందుకుంటున్నారు.ఆర్.కెనగర్‌లో ఉన్న ఈ దేవాలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రాంతం నుంచి లంబాడీలు సీతాఫలం పండ్లు అమ్మడానికి ఎద్దుల బండ్ల మీద వస్తున్నప్పుడు పొలాలు ఉన్న ఈ ప్రాంతంలో బండ్లు ఆగిపోయాయని అప్పుడు అమ్మవారి రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేసిన అనంతరం బండ్లు కదిలాయని ప్రస్తుత దేవాలయం నిర్వాహకుడు పద్మారావు తెలిపారు. దేవాలయాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో షిరిడీసాయిబాబా దేవాలయం నిర్మించామని ఆయన పేర్కొన్నారు.


విజయదుర్గ అమ్మవారు


అలంకారంలో అమ్మవార్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లోని అమ్మవారి ఆలయాలు బోనాల జాతరకు ముస్తాబయ్యాయి. అన్ని విభాగాల అధికారులు, ఆలయ నిర్వాహకులు బోనాల జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 28,29 తేదీల్లో జాతర జరుగుతుంది.

కోర్కెలు తీర్చే ఉజ్జయినీ మహంకాళి

సికింద్రాబాద్ అమ్మవారి బోనాల జాతర తర్వాత మల్కాజిగిరిలోని ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి జాతర ప్రసిద్ధి చెందింది. సుమారు ఏడు దశాబ్దాల క్రితం మల్కాజిగిరి గ్రామంగా ఉన్నప్పుడు గ్రామ పెద్దలు పిల్లి చిత్తయ్య యాదవ్, కర్రె సత్తయ్య, వాలినర్సింహ, గండయ్య, ముదిగొండ సుందరయ్య, కొమురయ్య యాదవ్, వెంకయ్యలు ఓల్డ్ మల్కాజిగిరిలో చిన్న దేవాలయాన్ని నిర్మించి చెక్కతో తయారుచేసిన అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. అనంతరం వారి వారసులు దాతల సహకారంతో రెండు దశాబ్దాల క్రితం నూతన దేవాలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. సికింద్రాబాద్ దేవాలయం వద్ద మహిళలు రంగం(భవిష్య వాణి) చెప్పే కార్యక్రమం జరుగుతుంది. మల్కాజిగిరి అమ్మవారి దేవాలయం వద్ద యాప్రాల్‌కు చెందిన రవీందర్ కుటుంబీకులు పచ్చి మట్టి కుండపై నిల్చొని ఆనవాయితీగా రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపిస్తారు. ఈ నెల 28న అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం, ఫలహారం బండ్ల ఊరేగింపు, 29న రంగం, పోతరాజు కార్యక్రమం, బలిగంప, అమ్మవారిని సాగనంపే కార్యక్రమం జరుగుతుంది.



మల్కాజిగిరిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం

చల్లగ చూసే.. నల్ల పోచమ్మ



బాలసరస్వతీనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం కూడా ప్రసిద్ధి చెందింది. కుమ్మరి కులస్తుల ఆధ్వర్యంలో ఈ దేవాలయ నిర్వహణ కొనసాగుతుంది. నిజాం కాలంలో రజాకార్ల దాడిలో అమ్మవారి విగ్రహం దెబ్బతినడంతో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఫలహారం బండ్లు మొదట ఈ దేవాలయం వద్దకు వెళ్లి తర్వాత ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి దేవాలయానికి చేరుకుంటాయి. రంగం కార్యక్రమానికి ఆనవాయితీగా పచ్చికుండను తయారు చేయించి ఊరేగింపుగా తీసుకొని వస్తారు.

కరుణించే కట్ట మైసమ్మ



మల్కాజిగిరి గ్రామంగా ఉన్నప్పుడు నడిమి చెరువు (ప్రస్తుతం సఫిల్‌గూడ చెరువు) నీరు ద్వారా పంటలు పండించేవారు. అప్పటి రైతులు మొదట అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేసేవారు. అనంతరం ఆలయాన్ని నిర్మించి విజయదుర్గగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అర్చకులు రామాచార్యులు తెలిపారు. వినాయకనగర్, సఫిల్‌గూడ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఈ దేవాలయం వద్ద బోనాలు సమర్పించడానికి వస్తారు.

రూ 6.96 కోట్లతో అభివృద్ధి పనులకు తీర్మానం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు రూ 6.96 కోట్లతో పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ మేరకు 15 అంశాలపై తీర్మానం చేశారు. చికెన్, మటన్ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు ఏజెన్సీ నియామకానికి ఆమోదం తెలిపారు. తైబజార్ రద్దు తీర్మానాన్ని ఆమోదించారు. ఈనెల 28 న బోనాల ఉత్సవాల సందర్భంగా శ్రీ బంగారు మైసమ్మ దేవాలయాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించారు. ఎవరైనా ఏర్పాటు చేస్తే వాటిని వెంటనే తొలగించి ఫెనాల్టీ వేయాలని నిర్ణయించారు. అనంతరం మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం కౌన్సిల్ తీర్మానం చేసిన పనులకు టెండర్లు పిలిచి పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. తొలుత అత్యవసర పనులు చేయనున్నట్లు వెల్లడించారు. పాలకవర్గ సభ్యులందరిని కలుపుకుని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

రోడ్డు మరమ్మతులు పూర్తి


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ లిటిల్ పల్స్ స్కూల్ వద్ద గుంతలకు స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం మరమ్మతుల పనులు చేయించారు. గత కొంత కాలంగా గుంతలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఇబ్బంది రావద్దని సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతులు పనులు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాగర్, వెంకటేష్, బీజేపీ అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షులు సాయి, సురేష్, శివలు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి

కుషాయిగూడ: విజయ దివాస్‌ను పురస్కరించుకుని శుక్రవారం బీజేపీ చర్లపల్లి డివిజన్ నాయకులు కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కుషాయిగూడలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు నాదం, నేతలు లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, గణేష్ ముదిరాజ్, చల్ల ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ ప్రధాన మార్గంలో శుక్రవారం అధికారులు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు. ఇటీవల డివిజన్‌లో పర్యటించిన జడ్సీ ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధికారులను నిలదీయడమేగాక వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. దీంతో వ్యాపారులు అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎండ, వానలకు అడ్డుగా ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి అడ్డును తొలగించడంపై వ్యాపారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందడంతో కార్పొరేటర్ ప్రభుదాస్ అక్కడికి వచ్చివ్యాపారులకు ఇబ్బందులు కలిగించవద్దని అధికారులకు సూచించడంతో తూతూమంత్రంగా ఆక్రమణలు తొలగించి నిష్క్రమించారు. డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్, న్యాక్ ఇంజనీర్ యోగీశ్వర్, చైన్‌మెన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మల్కాజిగిరి: నేరెడ్‌మెట్ కాశీ విశ్వనాథాలయంలో శుక్రవారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో బోనాల జాతర సందర్భంగా హోమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు సతీష్‌కుమార్, సువర్ణలక్ష్మి, నమిత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 8,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం స్థానిక పార్కులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలిమా, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ మల్లేష్, ఆరతి, వాణి రమా, రామారావు, శేఖర్ పాల్గొన్నారు.


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వైద్యం వికటించి మహిళ మృతి

హాస్పిటల్ వద్ద బంధువుల ఆందోళన


సంధ్య (ఫైల్)

మల్లాపూర్: ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం నాచారం పోలీస్‌స్టేషన్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీంతో మృతురాలి బంధువులు ఆపరేషన్ చేసిన హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. మృతురాలి బంధువులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లాపూర్ సూర్యానగర్ కాలనీకి చెందిన బండి అరుణ్‌కుమార్ భార్య సంధ్య(28) ఈనెల 3న నాచారంలోని శివ నర్సింగ్ హోంలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంది. అనంతరం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే రెండు రోజుల తర్వాత కడుపు నొప్పి రావడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు కడుపులో పేగుకు ఇన్ఫెక్షన్ వచ్చిందని తెలిపారు. కాగా చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. దీంతో సంధ్య కుటుంబ సభ్యులు, బంధువులు మృత దేహంతో శివ నర్సింగ్ హోం ఎదుట ఆందోళన చేపట్టారు. డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న సంధ్య బంధువులు

కాంగ్రెస్ పార్టీలో చేరిక



బోడుప్పల్: మేడ్చల్ నియోజవకర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో బోడుప్పల్‌కు చెందిన 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, ఏంజిల్ ప్రభాకర్ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అనంతరం వారు ఆదివారం జరగనున్న బోడుప్పల్ బోనాల ఉత్సవాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆహ్వానించారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ ఓల్డ్ నేరెడ్‌మెట్ విద్యానగర్‌లో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో త్వరితగతిన పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. ర్యక్రమంలో ఏఈ దీపక్, వీఐ రమేష్, సంతోష్, నందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అల్వాల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నేరేడ్‌మెట్ పోలీసులు అన్నారు. శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ సంతోషిమానగర్ చౌరస్తా వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగించే,అమ్మకాలు జరిపే వారి వివరాలపై పోలీసులకు సమాచారం అందిస్తే సమాజానికి మేలు చేసిన వారవుతారన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్‌లో జరుగుతున్న మోసాలను వివరిస్తూ వాటి నుండి బయట పడేందుకు పలు జాగ్రత్తలను సూచించారు.


సంతోషిమానగర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బడ్జెట్‌లో వికలాంగులకు తీరని అన్యాయం


ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వికలాంగులు

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలని ఎన్పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్ అన్నారు. వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంపై శుక్రవారం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లో చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ బడ్జెట్‌లో వికలాంగుల ప్రస్తావన లేక పోవడం బాధాకరమన్నారు. పెన్షన్ పెంపు ఊసులేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు పునరాలోచించి వికలాంగుల సంక్షేమానికి నిధులు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్పీఆర్‌డి ప్రతినిధులు బాలయ్య, షైన్‌బేగం, రమేష్, శివ, మేఘమాల, నవ్య, శేఖర్, శ్రీను, కోటయ్య, ఐలయ్య, భాను, నరసింహ, అనిల్, నాగరాజు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.